క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్తా ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనమాల చంద్రప్రకాశ్ కవిత, పరమేశ్వరయ్య, దొడ్డ రమేశ్ రమాదేవి, పోలపెల్లి రాహుల్ రూప, వైష్ణవి పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్ గుప్తా, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, రాజశేఖర్, శ్రీరాం కిరణ్, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ బోనాలు



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలో యాదవులు గురువారం గంగమ్మ బోనాల పండుగ వేడుకగా నిర్వహించారు. మహిళలు తలపై బోనాలతో గంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో గ్రామంలో సందడి నెలకొంది.

క్షీరాభిషేకం



నల్లబెల్లి : మండల కేంద్రానికి ఆధార్ సెంటర్ మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్యశారద దేవి చిత్రపటానికి దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడారు. ఆధార్ కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు పులి రమేశ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో (నేటి) శుక్రవారం నుంచి ఆదివారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి (ఈఓ) శేషగిరి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. చివరి రోజు స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ, పండిత సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకావిష్కరణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ లింగం సంపత్, అధ్యాపకుడు అబ్బురబోయిన గోపికృష్ణ ఆధ్వర్యంలో ప్రచురించిన 'డిజిటల్ మార్కెటింగ్', భరత్ సామిశెట్టి, డాక్టర్ అబ్బురబోయిన గోపికృష్ణ రాసిన 'ఇండస్ట్రియల్ రిలేషన్స్' పుస్తకాలను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సెక్రెటరీ రాజేశ్వర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, అసిస్టెంట్ కంట్రోలర్ నారాయణ, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

25న వేలం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన శ్రీ కట్టమల్లన్న ఆలయ ఆవరణలో ఈనెల 25న పలు విక్రయాలకు వేలం నిర్వహిస్తామని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, యాదవ, ఒగ్గు పూజారులు తెలిపారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాలకు రూ.15 వేలు, లడ్డూ, ప్రసాదం, పులిహోర వ్యాపారం కోసం రూ. 10 వేలు, స్వీట్ల అమ్మకానికి రూ.5 వేలు, కొబ్బరి ముక్కల సేకరణకు రూ.3 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కోసం ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడికి గాయాలు

నర్సంపేట రూరల్ : విద్యుద్ఘాతంతో కార్మికుడికి గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడు గుగులోతు కృష్ణ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చోరీకి పాల్పడిందెవరో?

రాయపర్తి ఎస్‌బీఐ చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- సోమవారం నుంచి బ్యాంక్ సేవల పునఃప్రారంభం?
- ఖాతాదారుల్లో ఆందోళన

రాయపర్తి: సోమవారం రాత్రి వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో 497 మందికి చెందిన ఖాతాదారులకు చెందిన 19 కిలోల బంగారు ఆభరణాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. పోలీసులు 4 బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. బంగారం తాకట్టుపెట్టి లోన్ తీసుకున్న ఖాతాదారులు బ్యాంక్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఖాతాదారులకు అన్యాయం జరగదని, తనఖా పెట్టిన సొత్తు తిరిగి అప్పగిస్తామని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. కాగా చోరీకి పాల్పడిందెవరో? అన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

కర్ణాటక, తమిళనాడులో గాలింపు

సీపీ ఆదేశాల మేరకు 4 బృందాలుగా ఏర్పడిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బ్యాంక్ చుట్టుపక్కల ఏమైనా ఆనవాళ్లు లభిస్తాయా అనే కోణంలో సైతం వెతుకుతున్నారు. ఇదిలా ఉండగా.. కర్ణాటక, తమిళనాడులో సైతం అనుమానం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. మరోవైపు బ్యాంక్ అధికారులను సైతం పోలీసులు విచారణ చేస్తున్నారు.



గేట్లు వేసి ఉన్న ఎస్‌బీఐ

సోమవారం వరకు బ్యాంకుకు రావొద్దని..

బ్యాంక్ సేవలు తిరిగి సోమవారం నుంచి అందుతాయని అప్పటి వరకు బ్యాంక్‌కు రావొద్దని అధికారులు చెబుతున్నారని బ్యాంక్ వద్దకు వచ్చిన ఖాతాదారులు, బాధితులు తెలిపారు. కాగా, ప్రస్తుతం చోరీ జరిగిన రోజు నుంచి బ్యాంక్ గేట్లు మూసే ఉంచుతున్నారు. బ్యాంక్ అధికారులు, పోలీసు బృందాలు బ్యాంక్‌లోకి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు

మండలకేంద్రంతోపాటు మండలంలోని పెర్కవేడు, మైలారం, కొండూరు, తిర్మలాయపల్లి, కొలన్‌పల్లి, కొత్తూరు తదితర గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో సుమారు 50 సీసీ కెమెరాల వరకు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ సీసీ కెమెరాలు కొన్నిచోట్ల మాత్రమే పని చేస్తున్నాయి. సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేస్తే ఇలాంటి చోరీల సమయంలో నిందితులను పట్టుకోవడం సులభమవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మా బంగారం ఎప్పుడిస్తరో..



మాది మహబూబ్‌నగర్ గ్రామం. 13 తులాల బంగారాన్ని ఎస్‌బీఐలో తాకట్టు పెట్టాం. బంగారం పోయిందని దిగాలుగా ఉంది. నిన్న ఏం తెలియలేదు.. చోరీ అయిన సొత్తు గుర్తించి ఏమైనా తెలిసిందోనని బ్యాంక్‌కు వచ్చా. అన్యాయం జరగదని బ్యాంక్ మేనేజర్ తెలుపుతున్నాడు. మా బంగారం ఎప్పుడిస్తారోనని ఆందోళనగా ఉంది.

– గిరుక సాయిరెడ్డి, మహబూబ్‌నగర్

30 తులాల బంగారం పెట్టిన



మాది జానకమ్మబండతండా. 30 తులాల బంగారం తనాఖా పెట్టాం. దొంగలు పడ్డట్టు తెలిసి నిన్న, ఇవాళ వచ్చా. గేటు పెట్టి ఉంది. బ్యాంక్ ఆఫీసర్లు సోమవారం రమ్మన్నారు.. వాళ్ల దయ.. ప్రభుత్వ అధికారుల దయ.. మా బంగారం ఎప్పుడిప్పిస్తరో ఏమో..

– నేతావత్ రాందాస్, జానకమ్మబండతండా, మొరిపిరాల

సృజనాత్మకత వెలికితీయడమే లక్ష్యం



చెన్నారావుపేట : విద్యార్థులతో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, తదితరులు

సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచి సృజనాత్మకత వెలికితీయడమే లక్ష్యంగా చెకుముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మోతె ఇంద్రసేనారెడ్డి, ప్రముఖ విద్యావేత్త గండి లింగయ్య, తదితరులు తెలిపారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పర్వతగిరి, చెన్నారావుపేట, ఖానాపురం, నల్లబెల్లి, నెక్కొండ, రాయపర్తి, తదితర మండలాల్లో గురువారం మండల స్థాయి చెకుముకి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. పలువురు విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవగా వారిని అభినందించారు. కార్యక్రమాల్లో జేవీవీ ప్రతినిధులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమమే ధ్యేయం

- టఫ్ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్



రాయపర్తి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

వర్ధన్నపేట/రాయపర్తి : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమమే తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ తెలిపారు. ఆ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన పాదయాత్ర పోస్టర్‌ను వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని అంబేడ్కర్ సెంటర్లలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి ఉద్యమించిన వారికి న్యాయం జరగడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించగా, అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో తాత్సారం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ తలపెట్టిన పాదయాత్ర కరీంనగర్ నుంచి వేములవాడ వరకు ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఉద్యకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షురాలు వంటల మల్లక్క, నాయకులు నర్మెట యాదగిరి, అల్లి యాదగిరి, మహేశ్వరం వేణు, గోక రాజు, రమేశ్, ఐత ప్రవీణ్, బొజ్జ ప్రభాకర్, తోటకూరి శ్రీధర్, జడ సతీశ్, కర్ర శ్రీనివాసరెడ్డి, మాడిశెట్టి లక్ష్మణ్, అశోక్, సారంగపాణి, భిక్షపతి, కేదారి, బక్కతట్ల రాజు, శ్రీనివాస్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

- రోటరీ క్లబ్ సెక్రటరీ వేణుగోపాల్

చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు రోటరీ క్లబ్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు ఆ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆయన మైక్‌సెట్ బహూకరించి మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడానికి చొరవ తీసుకుంటామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు మానుపాటి పాపమ్మ మాట్లాడుతూ క్లబ్ ప్రతినిధులు పాఠశాలకు తోడ్పాటు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పూజారి సురేందర్ గౌడ్, క్లబ్ బాధ్యులు శివప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ శ్రీనాథ్, వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి, ఉపాధ్యాయులు పాతూరు సుధాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కిశోర్, రవి, ఉమాదేవి, రజని, కౌసర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నర్సంపేట రూరల్ : సమాజంలోని ప్రతిఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన అవసరమని ఐకేపీ ఏపీఎం మహేందర్ తెలిపారు. మండలంలోని ముత్తోజిపేటలో బ్యాంకుల ద్వారా అమలవుతున్న జనశ్రీ బీమా, సురక్షా బీమా పథకాలతోపాటు సైబర్ నేరాలపై గురువారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు డిజిటల్ లిటరసీ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ధరణి స్వచ్ఛంద సంస్థ హనుమకొండ చైర్మన్ కల్లెపు శోభారాణి, సీసీలు యాకూబ్, వీఓఏలు భాగ్యలక్ష్మి, శ్రీలత, అరుణ, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి యుగేందర్, లీడ్ బ్యాంక్ ఉద్యోగి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

వర్ధన్నపేట : ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటసాయిలు అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు రూ.15 వేలు పింఛను, మహిళలకు రూ.2500 ప్రోత్సాహకం ఇస్తామని ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో నాయకులు కొండ్ర వెంకన్న, కలకోటి భాస్కర్, చిలుముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సర్వే చేయండి

నర్సంపేట రూరల్ : ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా కుటుంబ సర్వే చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లక్నేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అధికారులు గురువారం చేపట్టిన సర్వేను ఆయన సందర్శించి ఫారాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఎన్యుమరేటర్లకు సూచనలు అందించారు. ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలని చెప్పారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

వర్ధన్నపేట : పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జ్ మరియా సురేఖ గురువారం చేపట్టారు. పలువురికి ఆమె సభ్యత్వం అందజేసి మాట్లాడారు. టీడీపీ హయాంలోనే పేదలకు సుపరిపాలన అందిందని చెప్పారు. యువత పార్టీలో చేరి రాజకీయంగా ఎదగాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. టీడీపీకి నియోజకవర్గంలో పూర్వవైభవం తీసుకురావాలని శ్రేణులను కోరారు.

నియామకం



విశ్వబంధు చెన్నూరి రవి

నర్సంపేట : నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌జీఓ) జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బేతి విశ్వబంధు (భాస్కర్), ప్రధాన కార్యదర్శిగా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన చెన్నూరి రవి నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఉపాధ్యక్షుడిని, ప్రధాన కార్యదర్శిని అభినందించారు.

బ్యాంకులో పోలీసుల పరిశీలన



దుగ్గొండి : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ శాఖను సీఐ సాయిరమణ, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. లాకర్లను, ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితులతో మోగె సైరన్, రికార్డుల గదులను తనిఖీ చేశారు. భద్రతపై అడిగి తెలుసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా బ్యాంక్ లాకర్లను పరిశీలించినట్లు సీఐ తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా నిరంతరం పెట్రోలింగ్ చేస్తామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సంగెం : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. వర్ధన్నపేట మండలంలోని ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తవ్వి ఫిల్టర్ చేసి రవాణా చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులైన సత్తుపల్లి ధినేశ్, దడసాహెబ్, మల్లెపాక సారంగపాణిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై చెప్పారు.

ఆశ్రమ పాఠశాలలో అధికారుల సందర్శన

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా గిరిజనాభివృద్ధి సంస్థ అధికారి దాస్యం సౌజన్య, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి గురువారం సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం అధికారులు మీడియాతో మాట్లాడారు. పాఠశాలను ఇటీవల జిల్లా కలెక్టర్ సత్యశారద దేవి తనిఖీ చేసిన సమయంలో పలు లోపాలు, సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. ఈ క్రమంలోనే వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌ను ఆదేశించారని, తదనంతరం పాఠశాలలో వసతులను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు తాము పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించినట్టు వివరించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.

పథకాలతో పేదలకు లబ్ధి

నర్సంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతోందని తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ తెలినాకె, నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట, రాజుపేట, గార్లగడ్డతండాలో గురువారం ప్రజలకు పాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచిన నేపథ్యంలో ప్రభుత్వ విజయాలను ప్రజలకు పాటల రూపంలో వివరిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై ప్రజలు చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారులు యోచన, తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, తాళ్లపెల్లి అశోక్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : జెండా ఎగురేస్తున్న సోమయ్య, నాయకులు

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



నర్సంపేట రూరల్ : మాదన్నపేటలో..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, పర్వతగిరి, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, రాయపర్తి, తదితర మండలాల్లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



రాయపర్తి : వైద్యం చేస్తున్న డాక్టర్ సుధారాణి



ఖానాపురం : మందులు పంపిణీ చేస్తున్న శ్రీలక్ష్మి

రాయపర్తి : పశు వైద్యశిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని మండలంలోని పెర్కవేడు పశు వైద్యాధికారి సుధారాణి కోరారు. మండలంలోని కొత్తూరులో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి వరంగల్ జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి పలు పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పశు సంపదను పరిరక్షించుకోవాలని సూచించారు. పశువులను రోగాల బారి నుంచి కాపాడుకుంటే ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పాడి పశువులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి రైతులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీఓ లక్ష్మణ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, గోపాలమిత్రలు చెవ్వ రమేశ్, బి.రమేశ్, గోపాల్, శృతి పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్‌లో నిర్వహించిన గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో 126 పశువులకు వైద్యాధికారి శ్రీలక్ష్మి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సెమన్ అందుబాటులో ఉందన్నారు. అవసరం ఉన్న పాడిరైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు నర్సింహాచారి, లక్ష్మీనారాయణ, మాజీద్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత



విద్యార్థులకు వనదర్శినిపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌ఓ రీనా

ఖానాపురం : అడవుల సంరక్షణను సామాజిక బాధ్యతగా అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్‌ఓ) రీనా అభివర్ణించారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా మదర్స్ ల్యాండ్ స్కూల్ విద్యార్థులు మండలంలోని పాకాలను గురువారం సందర్శించారు. పాకాల, బటర్‌ఫ్లై గార్డెన్, బయో డైవర్సిటీ పార్కు, అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ రీనా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కల పెంపకంలో ముందుండాని సూచించారు. వనాలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు జన్మదినాల్లో మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రమేశ్, సునీత, నార్య, శివ, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు ప్రభాకర్, స్కూల్ కరస్పాండెంట్ రమేశ్, ప్రిన్సిపాల్ నవత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం తగదు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రకాశ్‌రావు, నాయకులు

ఖానాపురం : ధాన్యం కొనుగోలు కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయడం తగదని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని మంగళవారిపేటలోని కొనుగోలు కేంద్రాలను గురువారం వారు సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టకుండా మోసపూరితంగా కాలయాపన చేస్తోందని విమర్శించారు. తద్వారా రైతులు ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకే విక్రయించేలా తప్పుడు విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు 10 రోజులుగా ధాన్యం తీసుకొస్తుండగా కొనుగోళ్లు చేపట్టకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. సన్నధాన్యానికి బోనస్ ఇస్తామంటూ రైతులకు బోగస్ మాటలు చెప్పి ప్రభుత్వం మోసానికి పాల్పడిందన్నారు. కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఎమ్మెల్యే పరిశీలించిన దాఖలాల్లేవని చెప్పారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేశ్, సోమయ్య, వెంకన్న, ఆబోతు అశోక్, బాలునాయక్, రామ్మూర్తి, పసునూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు 'సఖి' సేవలు

సంగెం : గృహహింస, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రాల్లో సేవలు లభిస్తాయని కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. మండలంలోని షాపూర్, మొండ్రాయి గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బాధిత మహిళలకు పోలీస్, వైద్య, న్యాయ సహాయంతోపాటుగా అవసరమైన వారికి తాత్కాలిక వసతి లభిస్తుందని తెలిపారు. బాల్యవివాహాల నిరోధక, పోక్సో, తదితర చట్టాలతోపాటు సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌ను వినియోగించుకోవాలని కోరారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, 181, 1098, 14567 నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని చెప్పారు.

నర్సరీలోని మొక్కలను కాపాడాలి



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేట రోడ్డు ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న నర్సరీలోని ఎండిపోతున్న మొక్కలను కాపాడాలని బీజేపీ నాయకుడు కంభంపాటి పుల్లారావు కోరారు. ఆ నర్సరీని ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా పుల్లారావు ఎండిపోతున్న మొక్కలను పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ అధికారి శ్రీధర్ పర్యవేక్షణలోని వేలాది మొక్కలు ఎండిపోయాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి హరితహారం చేపడుతుండగా అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు ఎండిపోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాల్నె జగన్, కూనమళ్ల పృథ్వీరాజ్, పంజాల రాము, రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.